క్లుప్తంగా

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ



గుడివాడటౌన్: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం శ్రీ ద్వారకా సాయి సేవా సమితి బ్రాంచ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు ఆహార పొట్లాలు పంచిపెట్టారు. అనంతరం సమితి అధ్యక్షుడు దండమూడి సీతారామ స్వామి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా షిర్డి సాయిబాబా మందిరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలనే సంకల్పంతో బస్టాండ్ సెంటర్‌లో ఈ శాఖను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు మరీదు శ్రీనివాసరావు, కార్యదర్శి డి.నారాయణమూర్తి, కోశాధికారి కనకదుర్గ, సభ్యులు భాగవతుల ఉమామహేశ్వరి, పార్వతి, డి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

జమీగొల్వేపల్లి(పామర్రు): పిల్లలలో శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసం పెంపొందటానికి ఆటలు ఎంతగానో దోహద పడతాయని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలో గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం పలు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్యారమ్స్, చెస్, లూడో, వైకుంఠపాళి తదితర ఆటలలో పోటీలను నిర్వహించామన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మండల కేంద్రమైన పామర్రు గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందజేశారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

కైకలూరు: గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శుక్రవారం కలిదిండిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు డీవీ నరసయ్య కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కలిగించారు. కైకలూరులో చిన్నారులకు యోగా, నృత్యంపై శిక్షణ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయాధికారులు ఆర్.రాఘవులు, జె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి విరాళం

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాత గుడివాడకు చెందిన అమ్ముల సువర్ణ వెండి నాగపడగను శుక్రవారం విరాళంగా సమర్పించారు. స్వామి వారికి 241 గ్రాముల బరువైన వెండి పడగను సహాయ కమిషనర్ నేల సంధ్య చేతులమీదుగా ఆలయ కార్యాలయంలో అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

గంగానమ్మ ఆలయానికి రూ.15 వేలు విరాళం

కొండిపర్రు(పామర్రు): గంగానమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి దాతల విరాళం అభినందనీయమని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండిపర్రు గ్రామ శివారు దేవానందపురంలో ఆలయ నిర్మాణం నిమిత్తం దాతలు శుక్రవారం విరాళాలను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి మనం-వనం ఫౌండేషన్ తరపున రూ.15 వేలను విరాళంగా అందజేశారని అన్నారు. గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలను అందించి నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఆలయ కమిటీ సభ్యులకు తమ సహకారాలను అందించాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో మనం-వనం ఫౌండేషన్ నిర్వాహకులు పెనుమాల శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు తలారి మహేష్, నాయకులు కాకుళ్ల అశోక్, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో వైజ్‌వుడ్స్ నూరు శాతం

వానపాముల(పెదపారుపూడి): సీబీఎస్‌ఈ పది, ఇంటర్ ఫలితాల్లో మండలంలోని వానపాముల గ్రామంలో ఉన్న విశ్వభారతి వైజ్‌వుడ్స్ స్కూలు నూరు శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.సునీత శుక్రవారం తెలిపారు. ఇంటర్‌లో 500 మార్కులకు గాను ఎ.తరుణ్ (475), ఎ.నిఖిల్ దత్త(467), ఎ.కుబైబ్ 452, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు పేర్కొన్నారు. పదవ తరగతి ఫలితాల్లో 500 మార్కులను గాను యు.హేమ చంద్ర(488), ఎం.గౌతమ్ (486), డి.బలరామ్ నాయుడు (485), ఎ.అక్షర (485) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్టు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సంస్థ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్లు ఆర్.మంజుల, ఆర్.ప్రణీత్ అభినందించారు.

ముగిసిన హోమం

బంటుమిల్లి: పాశ్వాపురం గ్రామంలోని సువర్చల ఆంజనేయస్వామి దేవాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సుందరాకాండ పారాయణ, హోమం శుక్రవారంతో ముగిశాయి. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పురాణ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి హస్తోత్సులతో చేసిన సుందరాకాండ పారాయణ ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, కీర్తిప్రదస్‌ల వేద మంత్రాల మధ్య సుందరాకాండ హోమానికి పూర్ణాహుతి జరిగింది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

రూ.10 కోట్లతో పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు

- త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం
- నిర్మాణం పూర్తయ్యేవరకు పీహెచ్‌సీలోనే సీహెచ్‌సీ సేవలు
- ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్



పామర్రు పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: నియోజకవర్గ కేంద్రమైన పామర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.10 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మార్పు చేయనున్నట్టు ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్ తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, నిర్మాణం పూర్తయ్యే వరకు పీహెచ్‌సీలోనే సీహెచ్‌సీ సేవలు అందిస్తామని చెప్పారు. పామర్రు పీహెచ్‌సీని శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్, వైద్యశాఖ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీ భవన సముదాయాలను, అక్కడి స్థితిగతులను నిశితంగా పరిశీలించారు. అక్కడి వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ప్రతి ఒక్కరికీ సరైన విద్య, మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని అన్నారు. పామర్రులో సీహెచ్‌సీ ఏర్పడితే పెద్దపెద్ద ఆపరేషన్‌లు, సర్జరీలు కూడా ఇక్కడే నిర్వహిస్తారన్నారు. దీనితో నియోజకవర్గ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. సీహెచ్‌సీ ఏర్పాటుకోసం ప్రస్తుతం ఉన్న భవనాలకు అదనంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో 15 సెంట్ల స్థలంలో కొత్తగా భవనాల నిర్మాణం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పీహెచ్‌సీలో భవనాలు కూడా ప్రస్తుతం బాగానే ఉన్నాయని వీటిని కూడా ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

సీహెచ్‌సీ వలన ఉపయోగాలు

- పామర్రు సీహెచ్‌సీగా మారటం వలన ప్రస్తుతం ఉన్న 6 పడకల వైద్యశాలను 30 పడకలకు పెంపుదల చేసి వైద్య సేవలను అందిస్తారు.
- ప్రస్తుతం ఉన్న వైద్య అధికారులు, సిబ్బందికి తోడుగా మరొక 38 మంది నిష్ణాతులైన వైద్యులను నియమిస్తారు. స్పెషలిస్టులైన సివిల్ అసిస్టెంట్ సర్జన్, గైనకాలజిస్టు, ఎనస్తీషియన్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, సర్జన్ జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌లు ప్రజలకు సేవలు అందిస్తారు.

సీఎంకు ధన్యవాదాలు

నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ఉన్న పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పుదల చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే ఆదేశాలు జారీ చేసి పనుల నిర్వహణకు అనుమతులు ఇచ్చినందుకు పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సుమారు రూ.10 కోట్ల అంచనాలతో సీహెచ్‌సీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీహెచ్‌వో ఇందిరాదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ బలరామిరెడ్డి, ఈఈ లింగయ్య నాయుడు, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో వై.రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఎ.రమాదేవి, ఎంపీటీసీ టి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ డి.బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఎం.సుబ్రమణ్యం, సింహాచలం, డి.డి. ప్రసాద్, మధురెడ్డి పామర్రు పీహెచ్‌సీ వైద్యులు పి.సుధారాణి, వై.సురేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఆర్డీఓ పి.పద్మావతి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి, పక్కన తహసీల్దార్ ఆంజనేయులు

గుడివాడరూరల్: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. మండల పరిధిలోని మోటూరు గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని తహసీల్దార్ కె.ఆంజనేయులతో కలసి శుక్రవారం ఆమె పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతుల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులు జరిగాయా లేదా అనే విషయంపై రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మోటూరు గ్రామంలో ధాన్యాన్ని 64 మంది రైతులు డైరెక్ట్‌గా మిల్లర్లకు విక్రయించగా వారందరికీ నగదు చెల్లించామని, ఈ సందర్భంగా ఆర్డీవో రైతులకు వివరించారు. ఇంకా ఎవరైనా రైతులు మిల్లర్లకు అమ్మిన ధాన్యానికి సంబంధించిన నగదు అందకపోతే రైతు భరోసా కేంద్రంలో గాని, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు గాని సమాచారం అందించాలని కోరారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలు, పురుగు మందులను ఇప్పటి నుంచే సిద్ధం చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులకు గ్రామస్థాయిలోనే వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, సబ్సిడీ యంత్రాలు అందజేస్తామన్నారు. రైతుభరోసా కేంద్రం సేవలను ఆయా గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాలకు వచ్చే రైతుల పట్ల కేంద్రాల్లో సిబ్బంది మర్యాదగా నడుచుకుని వారికి కావాల్సిన వాటిని త్వరితగతిన అందచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో రైతులు నేరుగా మిల్లర్లకే ధాన్యం విక్రయించడం వల్ల నగదు అందక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రెండురోజుల క్రితం మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నగదు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ క్రమంలోనే రైతులకు ధాన్యం నగదు అందాయా లేదా అనే విషయాలను రైతుల వద్దకే వచ్చి నేరుగా తెలుసుకుంటున్నామన్నారు. ఇంకా ఏ రైతులకు అయినా మిల్లర్ల నుంచి నగదు అందకపోతే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో రైతులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సమస్యల అర్జీని ఎమ్మెల్యేకు అందజేస్తున్న సీహెచ్‌వోలు

పామర్రు: వైద్య ఆరోగ్యశాఖలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం జరిగేలా చూస్తానని పామర్రు శాసన సభ్యుడు కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సీహెచ్‌వోలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. కొద్దిరోజుల క్రితం నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న అన్ని స్థాయిల అధికారుల జీతాలను పెంచి తమకు మాత్రం పెంచలేదని సీహెచ్‌వోలు వాపోయారు. గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి ఏడాది 5 శాతం జీతాలు పెంచాల్సి ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ జిల్లా సభ్యులు యామిని, ఉదయ్‌కిరణ్, అనూష, సందీప్, స్టీవెన్‌సన్, సింధు, కుసుమ, సుమన్య, సంధ్య, శిరీష పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుడివాడటౌన్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, బ్యాంక్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, చౌదరి పేట, పంచవటి కాలనీ, ఆటోనగర్, తదితర ప్రాంతాలలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

అర్హుల జాబితా ప్రదర్శించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటమణి

మండవల్లి: రైతు భరోసాకు అర్హుల జాబితా ఆర్బీకేల్లో ప్రదర్శించాలని ఏడీఏ జి.వెంకటమణి సూచించారు. మండవల్లి వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట పైర్లను భూమిలో చల్లి పూత దశలో నేలలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని, జీలుగ, పిల్లిపెసర విత్తనాల కోసం ముందుగా తమను సంప్రదించాలని రైతులకు సూచించారు. సబ్సిడీపై ఇచ్చే కిసాన్ డ్రమ్ముల కోసం వీఏఏలను సంప్రదించాలని ఎంఏఓ షేక్ జరీనా తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు ఏడీఏ వెంకటమణి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి బోర్డు సభ్యులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గొర్ల శ్రీను

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం(పెద్ద శివాలయం) అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం పరిపాలనా విభాగం భవనానికి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను పూజా కార్యక్రమాలతో ఈ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం ప్రాంగణంలో రూ.కోటి 75 లక్షలతో కాలక్షేప మందిరం నిర్మిస్తున్నామని దాంతో పాటు దేవాలయ కార్యాలయ భవనం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్చకుని నివాసం, ఉత్తర ద్వార గోపురం, సలాహారం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరి రాంబాబు, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), కమిటీ సభ్యులు జోగా సూర్యప్రకాశరావు, జ్యోతుల శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ దరఖాస్తులకు ఆహ్వానం

మొవ్వ: ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఆర్‌వీ ప్రసాద్ శుక్రవారం వెల్లడించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో పాటు వృత్తి విద్యా గ్రూపులైన ఎంఈటీ, ఏ అండ్ టీ, ఓఏఎస్ గ్రూపుల్లో 80 సీట్లు చొప్పున అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, అడ్మిషన్ ప్రక్రియ జూన్ 14వ తేదీతో ముగుస్తుందని, అడ్మిషన్‌ల కోసం విద్యార్థులు నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ఎలకుర్రు(పామర్రు): మండలంలోని ఎలకుర్రు గ్రామంలో ఉన్న శ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామివారి 22వ వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి విశేషంగా అభిషేకాలు, అర్చన అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ధవళేశ్వరపు తాతాచారి రత్నమహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బంధుమిత్రుల, భక్తుల సహాయ సహకారాలతో వేద మంత్రాల నడుమ మేళ తాళాలతో అత్యంత వైభవంగా వార్షిక కల్యాణ మహోత్సవం జరిగింది. దీనిలో భాగంగా బ్రహ్మశ్రీ చలపాక గంగాధరరావు కామాక్షమ్మ దంపతుల చేతుల మీదుగా అన్నదానం జరిపినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

డిప్లొమో కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: విజయవాడలో గల ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమో కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఇన్‌స్టిట్యూట్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను డిప్లొమో, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సుల్లో డిప్లొమో ఇన్ ప్లాస్టిక్‌మౌల్డ్ టెక్నాలజీ 10వ తరగతి పాస్ ఆ పైన, 2 సంవత్సరాల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ ఆపైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, ఓసీ విద్యార్థులు రూ.500 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. ఈనెల 28 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే జూన్ 11వ తేదీ అడ్మిషన్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందే అర్హులైన వారందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాలకు 93985 35697ను సంప్రదించవలసిందిగా కోరారు.

రైతులకు అందుబాటులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు



కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివయ్య

పామర్రు(తోట్లవల్లూరు): అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న తదితర పంటల రైతులకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలోని రిజిస్టర్లలో నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో 2022-23 ఏడాదిలో 3,313 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు కొంత ఇబ్బంది పరిస్థితి ఎదుర్కొన్నారన్నారు. రైతులు పండించిన పంట ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాల సహాయంతో తోట్లవల్లూరు మండలంలో మూడు చోట్ల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. తోట్లవల్లూరు కన్స్యూమర్ కోఆపరేటివ్ సొసైటీ, భద్రిరాజుపాలెం పీఏసీఎస్, చాగంటిపాడు పీఏసీఎస్‌లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

మొక్కజొన్న విక్రయానికి అవసరమైన ప్రామాణికాలు

తేమ-14శాతం, ఇతర వ్యర్థ పదార్థాలు 1శాతం, ఇతర పంట గింజలు 2 శాతం, దెబ్బతిన్న గింజలు 1.5 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న రంగుమారిన పగిలిన గింజలు 4.5 శాతం, ముతక, పూర్తిగా తయారు కాని గింజలు 3 శాతం, పురుగు పట్టిన గింజలు 1 శాతం కలిగిఉండాలని అన్నారు.

మండల పరిధిలోని యాకమూరు, గరికపర్రు, పెనమలూరు, ఐలూరు, బొడ్డపాడు, సౌత్ వల్లూరు, రొయ్యూరు, నార్త్ వల్లూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులు తోట్లవల్లూరు కన్స్యూమర్ సొసైటీలో అమ్ముకోవాలని అన్నారు.దేవరపల్లి, భద్రిరాజుపాలెం పరిధిలోని రైతులు భద్రిరాజుపాలెం పీఏసీఎస్‌లో అమ్ముకోవాలని చెప్పారు. చాగంటిపాడు పరిధిలోని రైతులు చాగంటిపాడు పీఏసీఎస్‌లో అమ్ముకోవాలన్నారు. ప్రతి రైతు తమ పంట శాంపిల్స్‌ను తీసుకువచ్చి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. మొక్కజొన్న అమ్మకాలలో రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సెల్ నంబరు 8661056798, లేదా మండల తహసీల్దార్ సెల్ నంబరు 98499 04000 ను సంప్రదించాలని తెలియజేశారు.

కొల్లేరు సమస్యలపై ఎంపీ మిధున్‌రెడ్డికి వినతి



ఎంపీ మిధున్‌రెడ్డికి కొల్లేరు సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ శ్రీధర్

కైకలూరు: కొల్లేరు సమస్యలపై ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఎంపీ మిధున్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కైకలూరులో ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు నియోజకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో జీఓ 120లో సూచించని 7500 ఎకరాల విస్తీర్ణంలో చేపల చెరువులను అదనంగా ధ్వంసం చేశారన్నారు. ఆ భూములను అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కొల్లేరులో పేదలకు పంపిణీ చేయాలని కోరామన్నారు. సుప్రీం కోర్టు నిబంధనలకు లోబడి కొల్లేరు గ్రామాల్లో పెరిగిన జనాభా ఆధారంగా తాగునీటి చెరువులు, పశువులకు ఉపయోగపడే చెరువుల ఏర్పాటుకు అనుమతులు అందించాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. కొల్లేరు ప్రజల ఆకాంక్షలను సీఎం దృష్టికి తీసుకువెళతానని మిధున్‌రెడ్డి చెప్పారన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణం వేగిరం చేయాలి

కై కలూరు: నాణ్యతా ప్రమాణాలతో కమ్యూనిటీ హాలు భవనాన్ని వేగవంతంగా నిర్మించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆటపాక గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.5 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.2 లక్షలు, ప్రజా విరాళాలతో నిర్మిస్తోన్న కట్టడాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కన్నా రమేష్, సింగంశెట్టి రాము, వి.సుబ్బారావు, సిద్దాబత్తుల శ్రీరామమూర్తి, వేల్పూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి

మండవల్లి: విద్యార్థి దశ నుంచే పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ బ్రాంచ్ మేనేజర్ బొంతు దుర్గారావు, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు నగదు పొదుపుపై అవగాహన కల్పించారు. మేనేజర్ దుర్గారావు మాట్లాడుతూ పొదుపు డబ్బాలను ప్రదర్శించి ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎటువంటి డిపాజిట్ లేకుండా జీరో అకౌంట్ ఖాతా తెరుస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైకలూరు: మరమ్మతుల నిమిత్తం కైకలూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ టి.రామకృష్ణ తెలిపారు. కై కలూరు, పుట్లచెరువు, పెరికేగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు, కలిదిండి మండలం కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సమాజంలో నర్సుల పాత్ర గొప్పది



మండవల్లి పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులను సత్కరిస్తున్న సర్పంచ్ ఝాన్సీ, డాక్టర్ అనిల తదితరులు

కై కలూరు: వైద్య సేవలు అందించడంలో నర్సుల పాత్ర ఎంతో గొప్పదని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కుమారుడు వినయ్ పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కంటి వైద్యులు గరికిముక్కు జాన్ విక్టర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కేక్ కట్ చేశారు. తండ్రికి తగ్గ కుమారుడిగా వినయ్ ప్రజా సేవలో ముందున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీనవరత్న కుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, మండవల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, దానం ప్రసాద్, గోత్రు పాట్రిక్‌పాల్, తలారి జాన్ విక్టర్, దండే రవి ప్రకాష్, బేతపూడి ఏసోబురాజు, మెండా సురేష్, గండికోట ఏసుబాబు, వార్డు సభ్యుడు గాలిబ్ బాబు పాల్గొన్నారు.

సంతోష్ మారుతీ ఆధ్వర్యంలో..

కైకలూరు సంతోష్ మారుతీ బ్రాంచి మేనేజర్ దొంతమాల కిరణ్ ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో హెడ్ నర్సు సీహెచ్ వర్జీనియా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నర్సులు వై.లక్ష్మి, కె.ప్రేమ, ఎ.సువర్ణ, రవికుమారి, ఝాన్సీరాణి, సువర్ణ, నిహార్, అనురాధ, రమాదేవి, కై కలూరు సంతోష్ మారుతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు సన్మానం

మండవల్లి: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు ఎం.ఏసుకుమారి, పి.నజీనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎం.అనీల, కేథరిన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మెండా సురేష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

20 నాటికి భూముల సర్వే పూర్తిచేస్తాం

- ముదినేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్
- జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదుపై తక్షణ స్పందన

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక దళితులకు కేటాయించిన భూములకు సంబంధించి ఈనెల 20 నాటికి సర్వే పూర్తిచేసి భూములు అప్పగిస్తామని తహసీల్దార్ కె.శ్రీనివాస్ అన్నారు. గ్రామానికి చెందిన 317 మంది దళితులకు 95.4 ఎకరాల భూమిని గతంలో కేటాయించారు. ఈ భూమి ప్రస్తుతం చెరువుగా రూపాంతరం చెందడంతో దళితులు వ్యక్తిగతంగా సాగుచేసుకునే అవకాశం లేకుండా పోయింది. చెరువును ఎండగట్టి సర్వే చేసి అప్పగిస్తే దళితులు వ్యక్తిగతంగా లేదా సామూహికంగా సాగుచేసుకునే అవకాశం ఉంటుంది. దీనిపై పలుమార్లు అధికారులను కోరినప్పటికీ ఫలితం కనిపించలేదు. గ్రామానికి చెందిన జోషి అనే వ్యక్తి ఇటీవల ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎం కార్యాలయ సిబ్బంది వెంటనే స్పందించడంతో తహసీల్దార్ వైవాకలో జోషితో శుక్రవారం మాట్లాడారు. దళితుల భూములకు సంబంధించి ఈనెల 20లోపు సర్వే పూర్తిచేసి హద్దులు నిర్ణయిస్తామని చెప్పారు. దీనిపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి జోషి కృతజ్ఞతలు తెలిపారు.